# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 20 - జూన్ - 2026 | సంపుటి:4 | సంచిక : 16 | పేజీలు:8 | వెల:రూ5 | www.telanganamuchatlu.in




## విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రాష్ట్రాన్ని విద్యా, క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 27.50 లక్షల మంది విద్యార్థులకు విద్యార్థి కిట్లు
- విద్యార్థుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థినీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసి వారిని సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను దేశంలోనే విద్యా, క్రీడా రంగాలకు ఆదర్శ రాష్ట్రంగా మార్చాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసి పలు విద్యా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవడానికి అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం చిరుతిండిని అందిస్తున్నామని, భవిష్యత్తులో రవాణా సౌకర్యాన్ని కూడా అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల 50 వేల మంది విద్యార్థులకు విద్యార్థి కిట్లు అందజేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆత్మగౌరవంతో చదువుకునేలా అవసరమైన వస్తువులన్నింటినీ ఈ కిట్లలో అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.26,600 కోట్లు కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్తుపై పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో అనేక

మిగతా 2లో..

## ప్రజావాణితో శిశువుకు ప్రాణదానం




**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రజావాణి కార్యక్రమం మరో కుటుంబంలో ఆశలు నింపింది. పుట్టుకతోనే తీవ్రమైన గుండె సమస్యతో బాధపడుతున్న ఓ నవజాత శిశువుకు సకాలంలో వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడింది. ప్రజావాణి బృందం చొరవతో చిన్నారి అత్యవసర శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన రోజువారీ కూలీ అంజనేయులు దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించింది. గ్రేసీ అనే ఆ చిన్నారికి పుట్టిన కొద్ది సేపటికే గుండెకు సంబంధించిన తీవ్రమైన జన్యుపరమైన లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చిన్నారిని పలు ఆసుపత్రుల్లో పరీక్షించగా అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు.

మిగతా 2లో..

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఏర్పాట్లు

- జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధృవీకరణ
- పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు పాతికేళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి ప్రారంభించి ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి ధృవీకరిస్తారు. ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు.


మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలు, నకిలీ నమోదులను గుర్తించి జాబితా నుంచి తొలగించనున్నారు. అదే సమయంలో అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాని వారిని గుర్తించి చేర్చే చర్యలు చేపడతారు. దీంతో ఓటర్ల జాబితా మరింత ఖచ్చితంగా, విశ్వసనీయంగా మారనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2లో..

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ-సర్వేకు శ్రీకారం.. తొలి దశలో 2,240 గ్రామాల ఎంపిక

ప్రతి భూమికి ప్రత్యేక భూదార్ సంఖ్య... మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో

## సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలి

- భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి
- భూపాలపల్లిలో రక్షణ సమీక్షా సమావేశం
- ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచన




**భూపాలపల్లి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి పనికి సంబంధించిన భద్రతా సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహిస్తే గనుల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, తద్వారా సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దవచ్చని గనుల భద్రత విభాగం సంచాలకుడు డాక్టర్ ఐ. సత్యనారాయణ పేర్కొన్నారు. భూపాలపల్లి ప్రాంతంలో నిర్వహించిన రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గనుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను అత్యంత బాధ్యతాయుతంగా పాటించాలని ఆయన సూచించారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

మిగతా 2లో..

## రాష్ట్ర ఆర్థిక బలోపేతంపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష

- వనరుల సమీకరణపై కీలక చర్చలు
- పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- ఆదాయ వృద్ధికి కొత్త మార్గాల అన్వేషణ



**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ఆర్థిక బలోపేతం, ఆదాయ వనరుల పెంపు లక్ష్యంగా వనరుల సమీకరణ కేబినెట్ ఉపసంఘం సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. "మన వనరులే మన పెట్టుబడి" అనే లక్ష్యంతో రాష్ట్ర ఆదాయ వృద్ధి, సంపద సృష్టి, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చే అవకాశాలను గుర్తించి వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల కోసం బాలవాటిక, ప్రాథమిక తరగతులను ప్రారంభించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పేద కుటుంబాల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను పొందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. బాలవాటిక నుంచి ఇంటర్ వరకు స్పష్టమైన విద్యా విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఆదర్శ ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. తెలంగాణను దేశానికి ఆదర్శ విద్యా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు దేశానికి దిశానిర్దేశం చేశారని, తెలంగాణలోని ప్రతి పేద కుటుంబం నుంచి కూడా అలాంటి గొప్ప వ్యక్తులు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తరగతి గదులే జీవితాలను మార్చగలవని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ కుటుంబాలతో పాటు రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

# ప్రజావాణితో శిశువుకు ప్రాణదానం

(మొదటి పేజీ తరువాయి)

అయితే చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆర్థికంగా బలహీనమైన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. కుమార్తె ప్రాణాలను కాపాడాలనే ఆవేదనతో అంజనేయులు ప్రభుత్వ సహాయం కోసం ప్రజావాణిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ప్రజావాణి బృందం వెంటనే స్పందించింది. చిన్నారిని ప్రత్యేక వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసి చికిత్సకు కావాల్సిన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేయించింది. ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.8 లక్షలు మంజూరు చేయడంతో చిన్నారికి అవసరమైన గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. కుటుంబంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా మొత్తం చికిత్స వ్యయాన్ని ప్రభుత్వం భరించింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలకు వేగంగా స్పందిస్తూ అవసరమైన సహాయాన్ని అందిస్తోందనడానికి ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచి ఆశాజ్యోతి వెలిగించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు.

# సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఉద్యోగి తన భద్రతతో పాటు సహచర ఉద్యోగుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలని అన్నారు. సింగరేణి సంస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. గనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల నివారణలో అవగాహన, అప్రమత్తత, క్రమ శిక్షణ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రక్షణ సమీక్షా సమావేశంలో గనుల్లో అమలవుతున్న భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ఉద్యోగుల శిక్షణ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. భద్రతా ప్రమాణాల అమలులో అధికారులు, కార్మిక సంఘాలు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల ప్రాణ భద్రత కూడా అంతే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విభాగంలో భద్రతా తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించి లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. ప్రమాద రహిత వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో భద్రత విభాగం ప్రధాన అధికారి సాయిబాబు, భూపాలపల్లి ప్రాంత ప్రధానాధికారి ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. గనుల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేసి సింగరేణిని దేశంలోనే ఆదర్శవంతమైన ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

35 వేల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు పాల్గొననున్నారు. వీరితో పాటు వేలాది మంది బూత్ స్థాయి ప్రతినిధులు కూడా సహకరించనున్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికి చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని అధికారులు తెలిపారు. తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సరిగా ఉన్నాయో లేదో ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలోని సుమారు 3 కోట్ల 39 లక్షల మంది ఓటర్ల వివరాలను ఈ ప్రత్యేక కార్యక్రమంలో పరిశీలించనున్నారు. అర్హత తేదీగా 2026 అక్టోబర్ 1ను పరిగణనలోకి తీసుకుని తుది ఓటర్ల జాబితాను రూపొందించనున్నారు. స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఖచ్చితమైన ఓటర్ల జాబితా కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

# చార్మినార్‌లో కల్తీ ఆహార గోదాముపై దాడి

- **110 కిలోల చికెన్ స్వాధీనం**
- **ఇద్దరు బాధ్యుల అదుపులోకి**
- **ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన అక్రమ కార్యకలాపాలు**

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఆహార కల్తీ, అసురక్షిత ఆహార తయారీపై కొనసాగుతున్న ప్రత్యేక నిఘాలో భాగంగా చార్మినార్ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ ఆహార గోదాముపై అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. హైదరాబాద్ ఆహార కల్తీ నిఘా బృందం, ఆహార భద్రత అధికారులతో కలిసి హుస్సేనీఆలం పోలీసు స్టేషన్ పరిధిలోని పంచ్ మొహల్లా, న్యూ లాడ్ బజార్ ప్రాంతంలో ఈ తనిఖీలు చేపట్టింది. తనిఖీల సమయంలో ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే పరిస్థితుల్లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత అనుమతులు లేకుండానే గోదామును నిర్వహిస్తున్నట్లు తేలింది. ఆహార పదార్థాల తయారీలో నిషేధిత కృత్రిమ రంగులు ఉపయోగిస్తున్నట్లు, పాడైపోయిన వంట నూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే తాగునీటి నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలు పూర్తిగా విస్మరించడం, కీటకాల నివారణ చర్యలు చేపట్టకపోవడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. గోదాము పరిసరాలు అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో ఆహార భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాడుల్లో సుమారు 110 కిలోల వేయించిన కోడి మాంసం, ఆరు డబ్బాల వంట నూనె, కృత్రిమ రసాయన రంగులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలకు బాధ్యులైన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని పోలీసుల ఆధీనంలో ఉంచారు. ఇలాంటి కల్తీ, అపరిశుభ్రమైన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆహార విషబాధ, వాంతులు, విరేచనాలు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. పదేపదే ఉపయోగించిన నూనె, కృత్రిమ రంగుల వాడకం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. కాలేయం దెబ్బతినడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు అనుమతి పొందిన




ఆహార విక్రయ కేంద్రాల నుంచే ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఆహార భద్రతకు విఘాతం కలిగించే ఘటనలపై వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# యూరియా కలిసిన నీరు తాగి పది ఆవుల మృతి

- **కుమ్మరిగుడాలో విషాద ఘటన**
- **కాపరిపై అనుమానాలు**
- **దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**రంగారెడ్డి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలంలోని కుమ్మరిగుడా గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. యూరియా కలిసిన నీటిని తాగినట్లు అనుమానిస్తున్న పది ఆవులు మృతి చెందాయి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా పది ఆవులు ప్రాణాలు కోల్పోవడంతో యజమాని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. గ్రామ శివారులో ఉన్న పాకలో మేత మేసిన అనంతరం ఆవులు నీరు తాగినట్లు సమాచారం. కొద్దిసేపటికే ఒక్కొక్కటిగా కుప్పకూలడంతో యజమానులు ఆందోళనకు గురయ్యారు. పశువైద్యులను పిలిపించేలోపే పది ఆవులు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతిచెందిన పశువుల విలువ లక్షల రూపాయలు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆవులకు తాగునీటిగా ఉంచిన నీటిలో యూరియా కలిపినట్లు యజమాని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఈ ఘటన జరిగి ఉండవచ్చని ఆరోపిస్తున్నాడు. పశువుల మరణంతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఘటన అనంతరం ఆవుల కాపరి కనిపించకుండా పోవడం అనుమానాలకు తావిస్తోంది. పాక నుంచి అతడు పరారైనట్లు సమాచారం. దీంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన వెనుక ఉన్న కారణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. సమాచారం అందుకున్న కొత్తూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతిచెందిన ఆవుల వివరాలు నమోదు చేసి గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. పశువుల మరణానికి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యూరియా కలిసిన నీటి కారణంగానే పశువులు మృతి చెందాయా లేదా ఇతర కారణాలున్నాయా అనే అంశంపై విచారణ కొనసాగుతోంది. పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10,954 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2,240 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించి భూముల అసలు హద్దులను గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి అన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే సంఖ్యకు ఖచ్చితమైన గుర్తింపు, ప్రతి రైతుకు యాజమాన్య భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రీసర్వే పూర్తయిన తర్వాత భూముల యాజమాన్యంపై తలెత్తే వివాదాలకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నిజాం కాలం నాటి సర్వే రికార్డులే ఆధారంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. దశాబ్దాల కాలంలో భూముల విభజనలు, ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల కారణంగా వేలాది భూ వివాదాలు తలెత్తుతున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని వివరించారు.

రాష్ట్రంలో నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ సంఖ్యలు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పాతకాలపు గొలుసులు, కర్రలు, కొలత పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక ఉపగ్రహ ఆధారిత పద్ధతులను వినియోగించనున్నట్లు వెల్లడించారు. రీసర్వే అనంతరం ప్రతి భూమికి ప్రత్యేక భూదార్ సంఖ్య కేటాయించి ఆధార్ మాదిరిగా భూదార్ కార్డులు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సర్వే వివరాలను భూ భారతి వ్యవస్థలో నమోదు చేసి డిజిటల్ రూపంలో భద్రపరుస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు కోట్లకు పైగా సర్వే సంఖ్యలు ఉండగా వాటన్నింటికీ దశలవారీగా ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వేలాది మంది లైసెన్సు పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రతి మండలానికి అవసరమైన సిబ్బందిని నియమించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. రీసర్వే పూర్తయిన తర్వాత భూముల నమోదు, యాజమాన్య మార్పిడి, మ్యుటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో భూముల రీసర్వే ఒక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు పూర్తి స్థాయి భద్రత లభిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ఆర్థిక బలోపేతంపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక రంగాన్ని ఆదాయ వనరుగా మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పర్యాటక ఆస్తుల అభివృద్ధి, దేవాలయ పర్యాటకం, ప్రకృతి పర్యాటకం, ఆరోగ్య పర్యాటకాన్ని విస్తరించే అంశాలపై చర్చించారు. వారాంతాల్లో హెలికాప్టర్ పర్యాటక సేవలను ప్రారంభించే అవకాశాలను కూడా పరిశీలించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వెనుక జలాల ప్రాంతాల్లో కొత్త పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ విస్తరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పొరుగు రాష్ట్రాలకు ఇసుక ఎగుమతి అవకాశాలు, భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా పెరుగుతున్న ఆదాయం, రవాణా శాఖకు సంబంధించిన పన్నుల విధానం, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధికి అవసరమైన వనరులను సమకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అవసరమైన ఆర్థిక వనరుల పెంపు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రాహుల్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్న నాయకుడిగా రాహుల్ గాంధీని కొనియాడుతూ సామాజిక మాధ్యమ వేదికలో ప్రత్యేక సందేశం విడుదల చేశారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం పట్ల రాహుల్ గాంధీ చూపుతున్న అచంచల నిబద్ధత ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం చేస్తున్న కృషి దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని కల్పించిందన్నారు. ప్రజాస్వా



మ్య వ్యవస్థ బలోపేతం, రాజ్యాంగ పరిరక్షణ, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటం ప్రశంసనీయమని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల గొంతుకగా వ్యవహరిస్తూ దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.



## స్కూల్ జోన్‌లో పోలీసుల ఉక్కుపాదం.. పాన్, బెల్ట్ షాపులపై విస్తృత తనిఖీలు

**జమ్మికుంట టౌన్ జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, హుజూరాబాద్ ఏసీపీ పర్యవేక్షణలో జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులు, బెల్ట్ షాపులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా పాఠశాలల సమీపంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా, మత్తు పదార్థాలు లేదా ఇతర హానికర వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలను పోలీసులు పరిశీలించారు. విద్యార్థులకు హానికరమైన వస్తువుల విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

పాఠశాలల పరిసరాల్లో వ్యాపారం నిర్వహించే దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా వాతావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని, ప్రజలు మరియు వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.





## మామునూరు పీటీసీలో ఉత్సాహంగా ఎన్‌సీసీ శిబిరం

**వరంగల్,జూన్19(తెలంగాణ ముచ్చట్లు):** మామునూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ)లో 8(టి) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఏటీసీ-2 శిబిరం ఏడవ రోజు ఉత్సాహభరితంగా కొనసాగింది.శిబిర కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ డి.వి. సంతోష్ మెహర్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సున్వారే, క్యాంప్ సీనియర్ జేసీవో సుబేదార్ సంజయ్ కుమార్ రాణా పర్యవేక్షణలో క్యాడెట్లకు తుది వాలీబాల్ పోటీలు, తాడు లాగుడు పోటీలు నిర్వహించారు. క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ ఆర్. శిబిరాన్ని సందర్శించి క్యాడెట్లతో మమేకమయ్యారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం కోసం ఎన్‌సీసీ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి కేంద్రం సూపరింటెండెంట్ నయూమ్, వారి బృందం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్ వృత్తి అవకాశాలపై క్యాడెట్లకు విలువైన సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఏఎన్‌ఓలు, పీఐ సిబ్బంది, సీటీఓలు పాల్గొనగా, సుమారు 600 మంది క్యాడెట్లు హాజరయ్యారు. శిబిరం విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

**హుజూరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను హుజూరాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ



విలువల కాపాడటంలో రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా ఆయన దేశవ్యాప్తంగా ప్రజల అభిమానాన్ని పొందారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాహుల్ గాంధీ ఆశయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేలేరు గ్రామానికి రూ.45 లక్షల నిధులు మంజూరు

**వేలేరు, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామంలోని సీసీ రోడ్ల అభివృద్ధి కోసం మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.45 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ కాపీని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి, ఏఎంసీ డైరెక్టర్ కత్తి సంపత్లకు అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ, గ్రామంలోని సీసీ రోడ్ల సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి రూ.45 లక్షల నిధులను మంజూరు చేశారని తెలిపారు.



గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఆయన సహకారంతో వేలేరు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ బిల్లా యాదగిరి పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్మికుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

### దీక్షకు బీఎస్పీ సంఘీభావం

**జమ్మికుంట టౌన్ జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు సంఘీభావం ప్రకటించారు. జమ్మికుంటలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించిన బీఎస్పీ హుజూరాబాద్ అసెంబ్లీ నాయకులు కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ హుజూరాబాద్ అసెంబ్లీ ఇంచార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం





నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రూ.16,600గా ఉన్న నెలసరి వేతనాన్ని కనీసం రూ.26,000కు పెంచాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి మున్సిపల్ కార్మికునికి డబుల్ బెడ్‌రూం లేదా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, సానిటరీ కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు అందించాలని, రోజుకు 8 గంటల పనివేళలను మాత్రమే అమలు చేయాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే/ఎంపీ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, హుజూరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి గరిగే చంద్రయ్య (విశ్రాంతి ఉపాధ్యాయులు), జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు కోరె రంజిత్, పట్టణ అధ్యక్షుడు మొలుగూరి శ్రీనివాస్, నియోజకవర్గ మీడియా & సోషల్ మీడియా ఇంచార్జి మంద జగన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరుబాట

**హుజూరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. కార్మికుల ప్రధాన డిమాండ్ల సాధన కోసం జనవరి 18, 19 తేదీల్లో అన్ని మున్సిపల్ కమిషనర్ల కార్యాలయాల ఎదుట రెండు రోజుల పాటు రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు పట్టణాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ వంటి కీలక సేవలను అందిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు అందడం లేదని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవనం సాగించడం కార్మికులకు భారంగా మారిందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించేలా రిటైర్మెంట్ బెనిఫిట్స్, కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినా, హామీలు ఇచ్చినా అమలు జరగలేదని నాయకులు ఆరోపించారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, అందుకే ప్రజాస్వామ్యబద్ధంగా రిలే దీక్షలకు దిగుతున్నామని తెలిపారు. జనవరి 18, 19 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగే రిలే దీక్షల్లో మున్సిపల్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. మున్సిపల్ కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, గౌరవప్రదమైన జీవనోపాధి కోసం ఈ ఉద్యమం కొనసాగుతుందని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘన సన్మానం – కొత్త అధికారులకు ఆత్మీయ స్వాగతం

**పెద్దమండలికి,జూన్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీపై వెళ్తున్న అధికారులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు.ఇందిరమ్మ ఇండ్ల హౌసింగ్ విభాగం ఏఈ స్వాతి, ఆరోగ్య శాఖ ఏఎన్ఎం కౌసల్య, వ్యవసాయ శాఖ ఏఈఓ మధు గ్రామ అభివృద్ధి, ప్రజా సేవలలో అందించిన సేవలను గ్రామ ప్రజాప్రతినిధులు కొనియాడారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు వారికి శాలువాలు కప్పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.అలాగే వారి స్థానంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం మాట్లాడుతూ..బదిలీపై వెళ్తున్న అధికారులు గ్రామ ప్రజల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారని, వారి సేవలు గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు కృష్ణ, నరేష్, యాదమ్మ, పద్మ, భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఇందిరాలక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కన్న, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ అధికారులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## వరంగల్ జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ కన్వీనర్‌గా గూగులోత్ వినోద

**వరంగల్,జూన్19(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా సంగెం మండలంలోని పెద్ద తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ గూగులోత్ వినోద రవీందర్ నాయక్‌ను తెలంగాణ పంచాయతీ సర్పంచ్‌ల ఫోరమ్ వరంగల్ జిల్లా కన్వీనర్‌గా నియమించారు. సర్పంచ్‌ల ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల సమన్వయం కోసం కృషి చేస్తానని వినోద రవీందర్ నాయక్ పేర్కొన్నారు.తనపై నమ్మకం ఉంచి జిల్లా కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకత్వానికి, సహకరించిన సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ శ్రేణుల మధ్య రాహుల్ జన్మదిన సంబరాలు



- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు.

**సత్తుపల్లి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారం కోసం అంకితభావంతో కృషి చేస్తున్న ఆయన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమంగా గ్యాస్ సిలిండర్లు, మద్యం నిల్వ.. ఇద్దరిపై కేసు..



**సత్తుపల్లి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 గ్యాస్ సిలిండర్లు, 730 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,45,413గా అంచనా వేశారు. కల్లూరు ఏసీపీ వసుందర యాదవ్‌కు అందిన విశ్వసనీయ సమాచారంతో సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం బుగ్గపాడులో దూబికుంట్ల వీర రాఘవులు ఇంటిపై దాడి నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. విచారణలో వీర రాఘవులు, అతని సోదరి సాదు రాధిక కలిసి గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లను సత్తుపల్లిలో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు దూబికుంట్ల వీర రాఘవులు (50), సాదు రాధికపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి వెల్లడించారు.

# భారీగా పడిపోయిన బంగారం ధరలు..

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ బంగారం మార్కెట్‌లో నేడు భారీ పతనం నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశవ్యాప్తంగా పసిడి ధరలు గణనీయంగా క్షీణించాయి. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి నెలకొనడం, డాలర్ విలువ బలపడటం వంటి కారణాలతో బంగారం ధరలపై ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.3,650 మేర తగ్గగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,350 మేర పతనమైంది. దీంతో ఇటీవల వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు కాస్త బ్రేక్ పడింది.
హైదరాబాద్‌లో ఉదయం మార్కెట్ ప్రారంభ సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,860గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,700గా ఉండగా, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,09,390గా ఉంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ బంగారం ధరలు సమానంగానే నమోదయ్యాయి.
దేశంలోని ప్రధాన నగరాల విషయానికి వస్తే, చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,040గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,46,010గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పుణె నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,860గా ఉంది.
మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో బంగారం ధరల్లో మరింత హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ధరలు తగ్గడం వల్ల వివాహాలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయంగా మారిందని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోంది

- వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య



**పెద్దమందడి,జూన్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి (డీఈవో) యాదయ్య గురువారం సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు ప్రక్రియ, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, బోధన విధానాలు, ప్రయోగశాలల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఈవో యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.అలాగే ఇటీవల విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు మంచి ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశాయని, దీనికి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల కారణమని కొనియాడారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శేఖర్, మండల విద్యాధికారి మంజులత, ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**భీమదేవరపల్లి, జూన్ 19(తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను భీమదేవరపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, హుస్నాబాద్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్, మండల వైస్ ప్రెసిడెంట్లు చిట్కూరి అనిల్, గుడికందుల రాజు, బుర్ర ప్రశాంత్, హుస్నాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి బొల్లంపల్లి కాంతారావు, అసెంబ్లీ కార్యదర్శి వల్లెపు మహేందర్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదరి రాజేందర్, గిరబోయిన అఖిల్ యాదవ్, చిట్కూరి నితిన్, రవితేజ, నిఖిల్, ఎలబాక సురేష్, కూన ప్రశాంత్, శేఖర్, షఫీ, కైసర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# చిన్నారుల కలలకు అక్షర రూపం విద్యాభివృద్ధికి అంకితమైన సర్పంచ్ గొల్లపల్లి సంపత్



**ఎల్కతుర్తి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సంపత్ ఫ్రీ ప్రైమరీ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రధానోపాధ్యాయురాలు అరవింద, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎల్. మనోహర్ నాయక్, మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణలతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఫ్రీ ప్రైమరీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంపొందించి, వారి మేధో వికాసానికి దోహదపడే విధంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని సర్పంచ్ గొల్లపల్లి సంపత్ తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసించేలా అవసరమైన సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.
మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రాథమిక విద్య కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఎల్. మనోహర్ నాయక్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ఉమా, మల్లయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, కవిత, శ్రీనివాస్, మురళీధర్, మర్రి రవికుమార్, పబ్బు రాజు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో విద్యా అభివృద్ధికి సర్పంచ్ గొల్లపల్లి సంపత్ తీసుకుంటున్న చర్యలను పలువురు అభినందించారు

# 300 గ్రామాల ప్రజల ఆరోగ్యానికి జీవనాడి.. జమ్మికుంట ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలి

- ఎక్స్‌రే, స్కానింగ్, డయాలసిస్ సేవలు అందుబాటులోకి తేవాలని డిమాండ్.
- రోగుల సమస్యలను తెలుసుకున్న సీపీఎం నాయకులు.



**జమ్మికుంట టౌన్ జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జమ్మికుంట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణం 300కు పైగా గ్రామాలకు కేంద్రంగా ఉండటంతో ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి భారీ సంఖ్యలో రోగులు వస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా 30 పడకల ఆసుపత్రిగానే కొనసాగుతోందని, రెండు నెలల క్రితం 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు.
ఆసుపత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం వల్ల రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. స్కానింగ్ సెంటర్ లేకపోవడంతో ప్రైవేట్ కేంద్రాలు రోగులను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు.
ప్రభుత్వం ప్రకటించిన డయాలసిస్ కేంద్రం ఏడాది గడిచినా ఇంకా ప్రారంభం కాలేదని, దీంతో డయాలసిస్ రోగులు కరీంనగర్, హనుమకొండ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పత్రికా ప్రకటనలకే పరిమితమైన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.
ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు మరియు ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బంది జమ్మికుంటలోనే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం అత్యవసరమని ఆయన అన్నారు.

# రాహుల్ గాంధీ.. భారత రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర

- **నెహ్రూ-గాంధీ కుటుంబ వారసుడిగా రాజకీయ ప్రస్థానం**
- **భారత్ జోడో యాత్రతో జాతీయ స్థాయిలో గుర్తింపు**
- **ప్రతిపక్ష నాయకుడిగా కీలక పాత్ర, భవిష్యత్‌పై ఆసక్తి పెంపు**



భారత రాజకీయాల్లో నాలుగు తరాల చరిత్ర కలిగిన నెహ్రూగాంధీ కుటుంబ వారసుడిగా రాహుల్ గాంధీ ప్రత్యేక గుర్తింపు పొందారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఆయన, దేశ రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగా, ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన పాత్ర దేశ రాజకీయ పరిణామాల్లో ప్రముఖంగా నిలుస్తోంది. 1970 జూన్ 19న న్యూఢిల్లీలో జన్మించిన రాహుల్ గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల కుమారుడు. చిన్నతనం నుంచే రాజకీయ వాతావరణంలో పెరిగినప్పటికీ, ఆయన విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో చదివిన అనంతరం విదేశాల్లో కూడా ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయాల్లోకి రాకముందు కొంతకాలం కార్పొరేట్ రంగంలోనూ పనిచేశారు.

2004లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గం నుంచి తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికైన రాహుల్ గాంధీ, అప్పటి నుంచి జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. యువతను రాజకీయాల వైపు ఆకర్షించేందుకు, కాంగ్రెస్ పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు ఆయన కృషి చేశారు. యువజన కాంగ్రెస్, విద్యార్థి విభాగాల పునర్వ్యవస్థీకరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా, అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన రాహుల్ గాంధీ అనేక ఎన్నికల్లో పార్టీకి నాయకత్వం వహించారు. కొన్ని ఎన్నికల్లో విజయాలు సాధించినప్పటికీ, మరికొన్ని సందర్భాల్లో పార్టీ పరాజయాలను కూడా ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేశారు.

సామాజిక న్యాయం, నిరుద్యోగం, రైతుల సమస్యలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై రాహుల్ గాంధీ తరచుగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఉంటారు. పార్లమెంట్‌లోనూ, ప్రజా వేదికలపైనా ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేస్తుంటారు. సామాన్య ప్రజల సమస్యలను ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

దేశవ్యాప్తంగా విశేష చర్చకు దారితీసిన కార్యక్రమాల్లో భారత్ జోడో యాత్ర ఒకటి. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశ ఐక్యత, సామరస్యంపై సందేశం ఇచ్చారు. అనంతరం నిర్వహించిన రెండో విడత యాత్ర కూడా జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ యాత్రల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ప్రయత్నించారు. రాహుల్ గాంధీ రాజకీయ జీవితంలో విమర్శలు, వివాదాలు కూడా తక్కువగా లేవు. ప్రత్యర్థి పార్టీలు ఆయన నాయకత్వాన్ని తరచూ ప్రశ్నిస్తుంటాయి. అయితే విమర్శలను ఎదుర్కొంటూనే తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలు సహజమనే దృక్పథాన్ని ఆయన అనుసరిస్తుంటారు.

2024 సాధారణ ఎన్నికల అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ, ప్రభుత్వ విధానాలపై మరింత ప్రభావవంతంగా స్పందిస్తున్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడంతో పాటు ప్రత్యామ్నాయ విధానాలను సూచించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బాధ్యత ఆయన రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. దేశంలో యువత సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి ఆకాంక్షలు, ఉపాధి అవకాశాలు, విద్యా సమస్యలపై రాహుల్ గాంధీ తరచూ మాట్లాడుతున్నారు. యువత దేశ భవిష్యత్తును నిర్ణయిస్తారని, వారికి సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అనేక సందర్భాల్లో పేర్కొన్నారు. దీంతో యువతలో కూడా ఆయనకు ఒక వర్గం మద్దతు లభిస్తోంది.

56వ జన్మదినాన్ని జరుపుకుంటున్న రాహుల్ గాంధీ భారత రాజకీయాల్లో ఒక ముఖ్యమైన నాయకుడిగా కొనసాగుతున్నారు. విజయాలు, వైఫల్యాలు, విమర్శలు, ప్రశంసల మధ్య సాగిన ఆయన రాజకీయ ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని ఏ దిశగా నడిపిస్తారు, జాతీయ రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషిస్తారనేది దేశ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

# విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

- **కోటి రూపాయల సాయం కోరిన పార్టీ**
- **ప్రధానమంత్రికి లేఖ రాసిన వ్యవస్థాపకుడు**



నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదం నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న వివాదాల వల్ల విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ప్రవేశ పరీక్షలపై అనుమానాలు ఏర్పడటం వల్ల అనేక మంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని లేఖలో వివరించారు. పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతినడం యువతలో నిరాశను పెంచుతోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఇటీవల పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. పిల్లల చదువుల కోసం కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో వారిని కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని విషాదమని అన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక, మానసిక పరంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని సూచించారు. మరోవైపు జూన్ 20న కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యార్థుల సమస్యలను దేశ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. కాగా, జూన్ 21న నీట్ పునఃపరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలు పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణ, విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# నీట్ పరీక్షకు నిందితుడికి బెయిల్

అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న 18 ఏళ్ల యువకుడికి నీట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు ముంబై ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నాలుగు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తూ న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 18 నుంచి 21 వరకు బెయిల్‌పై విడుదల చేసి, జూన్ 22 మధ్యాహ్నం 2 గంటలలోపు తిరిగి జైలులో లొంగిపోవాలని ఆదేశించింది. ప్రస్తుతం నవీ ముంబైలోని తలోజా కేంద్ర కారాగారంలో ఉన్న ఈ యువకుడిపై భారతీయ న్యాయ సంహిత కింద అత్యాచారం కేసుతో పాటు చిన్నారుల రక్షణ చట్టంలోని పలు నిబంధనల కింద అభియోగాలు నమోదయ్యాయి. బెయిల్ అభ్యర్థనపై విచారణ సందర్భంగా బాధితురాలు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయస్థానానికి తెలియజేసింది. అయితే తనను లేదా తన కుటుంబ సభ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించకూడదని షరతు విధించాలని కోరింది.

నిందితుడి తరఫు న్యాయవాది వాదిస్తూ, విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం పునరావాస ప్రక్రియలో భాగమని తెలిపారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు యువకుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కొంత సమయం అవసరమని, పోలీసుల భద్రత మధ్య పరీక్ష రాయాల్సి వస్తే మానసికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. మరోవైపు ప్రభుత్వ తరఫు న్యాయవాది ఈ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. అవసరమైతే ఒక్కరోజు మాత్రమే పోలీసుల పర్యవేక్షణలో పరీక్ష రాసేందుకు అనుమతించాలని సూచించారు. అయితే పూర్తి స్థాయి తాత్కాలిక బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.ఆర్. శర్మ, నిందితుడి ఉన్నత పాఠశాల అర్హత పత్రం, నీట్ ప్రవేశ పత్రాన్ని పరిశీలించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బెయిల్ ఇవ్వడానికి తగిన కారణాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అభియోగ పక్షం వ్యక్తం చేసిన ఆందోళనలను కఠినమైన షరతుల ద్వారా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం పలు నిబంధనలు విధించింది. బాధితురాలిని ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించకూడదని, సాక్ష్యాలను ప్రభావితం చేయకూడదని, కేసుకు సంబంధించిన ఎవరినీ ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే నీట్ పరీక్ష రాసినట్లు ధ్రువీకరణ పత్రాలను జైలులో లొంగిపోయే సమయంలో సమర్పించాలని ఆదేశించింది. రూ.50 వేల పూచీకత్తుతో ఈ తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది.

# టెలిగ్రామ్‌కు షాక్.. కేంద్ర నిర్ణయానికి హైకోర్టు మద్దతు

- **నీట్ రీ-ఎగ్జామ్ భద్రతే లక్ష్యం**
- **జూన్ 22 వరకు తాత్కాలిక నిషేధం**

నీట్ రీఎగ్జామ్ నిర్వహణ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. పరీక్షల పారదర్శకత, భద్రతను కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధమైనదేనని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ తేజస్ కరియా వెలువరించిన తీర్పులో ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. సమాచార సాంకేతిక చట్టంలోని 69ఏ సెక్షన్ కింద కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసిందని కోర్టు పేర్కొంది. ఇందుకు ప్రభుత్వం సమర్పించిన కారణాలు సమంజసంగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి చర్యలు అవసరమని అభిప్రాయపడింది. పరీక్షలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలను అరికట్టడమే ప్రధాన ఉద్దేశమని తెలిపింది. విచారణలో ప్రశ్నాపత్రాల లీకేజీ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. కొన్ని ముఠాలు పరీక్షా పత్రాలను అక్రమంగా సేకరించి అభ్యర్థులకు పంపిస్తున్నాయని, వాటిని టెలిగ్రామ్ ద్వారా పంచుకున్నట్లు కేంద్రం కోర్టుకు వివరించింది. ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరించలేదని, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే



నిర్ణయం తీసుకుందని కోర్టు స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజనాలు, విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపింది. ప్రభుత్వ ఆదేశాలను అసమతుల్యంగా లేదా చట్టవిరుద్ధంగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. టెలిగ్రామ్ సంస్థ మాత్రం తమపై మాత్రమే నిషేధం విధించడం సరైంది కాదని వాదించింది. దేశంలో ఇతర సామాజిక మాధ్యమ వేదికలు యథావిధిగా పనిచేస్తుండగా తమ సేవలను మాత్రమే నిలిపివేయడం వివక్షపూరితమని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించింది. అయితే ప్రభుత్వ చర్యలకు తగిన ఆధారాలు ఉన్నాయని కోర్టు తేల్చడంతో సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. కాగా, కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌ను జూన్ 22 వరకు తాత్కాలికంగా నిరోధించింది. అదేవిధంగా జూన్ 30 వరకు సందేశాల సవరణ సౌకర్యాన్ని నిలిపివేసింది. జూన్ 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్‌ను ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించేందుకు కఠిన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

# మళ్లీ రగిలిన పశ్చిమాసియా



ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. దక్షిణ లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు లెబనాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రాంతీయ పరిస్థితులు మరోసారి ఆందోళనకరంగా మారాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన వెంటనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా అవగాహన ప్రకారం లెబనాన్‌తో పాటు సంబంధిత ప్రాంతాల్లో సైనిక చర్యలు నిలిపివేయాల్సి ఉంది. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపై ఉంటుంది. అయితే తాజా దాడులతో ఆ ఒప్పంద భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మాత్రం హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భద్రతా అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన ఇరాన్-అమెరికా తదుపరి చర్చలు వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలనే చెబుతున్నప్పటికీ, తాజా పరిణామాల ప్రభావమే దీనికి కారణమని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందన్న ఆశలు వ్యక్తమయ్యాయి. అయితే లెబనాన్‌లో కొనసాగుతున్న తాజా దాడులు ఆ ఆశలకు గండికొట్టాయి. పరిస్థితులు మరింత దిగజారితే ప్రాంతీయ స్థిరత్వంతో పాటు శాంతి ప్రయత్నాలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# జియో భారీ ఐపీఓకు రంగం సిద్ధం.. మార్కెట్‌లోకి రానున్న టెలికాం దిగ్గజం

దేశంలోని అతిపెద్ద టెలికాం సంస్థలలో ఒకటైన జియో ఇన్ఫోకామ్ త్వరలో భారీ ఐపీఓతో స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ముకేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు.

జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు ఇప్పటికే ఐపీఓ ముసాయిదా పత్రాలకు ఆమోదం తెలిపిందని, వాటిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఐపీఓ ద్వారా జియో సుమారు 4 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.36,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



దేశంలో డిజిటల్ సేవలు, 5జీ విస్తరణ, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ రంగాల్లో జియో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి నెలకొంది. జియో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయితే భారత టెలికాం రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

మరోవైపు జియో ప్లాట్‌ఫామ్స్ విలువను మరింత పెంచేందుకు సంస్థ డిజిటల్ సేవలు, కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, 5జీ నెట్‌వర్క్ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ఆధిపత్యం సాధించేందుకు భారీ పెట్టుబడులు పెట్టాలని సంస్థ యోచిస్తోంది.

జియో ఐపీఓ ప్రకటనతో దేశీయ పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. సెబీ అనుమతుల అనంతరం ఐపీఓ షెడ్యూల్, ధరల శ్రేణి, షేర్ కేటాయింపు వంటి పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్ వర్గాల దృష్టి మొత్తం జియో ఐపీఓపైనే కేంద్రీకృతమైంది.

# ఐటీ షేర్లలో భారీ పతనం.. రూ.1.35 లక్షల కోట్ల సంపద ఆవిరి

దేశీయ ఐటీ రంగం శుక్రవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ సాంకేతిక సేవల సంస్థ యాక్సెంచర్ విడుదల చేసిన తాజా ఆదాయ అంచనాల ప్రభావంతో భారత ఐటీ కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.1.35 లక్షల కోట్ల మేర నష్టం నమోదైనట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

కృత్రిమ మేధ ప్రభావంతో భవిష్యత్తులో సమాచార సాంకేతిక సేవల రంగంలో వృద్ధి మందగించే అవకాశం ఉందని యాక్సెంచర్ తన నివేదికలో సూచించింది. ఈ ప్రకటనతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొని, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. మార్కెట్ ట్రేడింగ్‌లో ప్రముఖ ఐటీ సంస్థల షేర్లు తీవ్రంగా పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 8.59 శాతం తగ్గగా, టెక్ మహీంద్రా షేర్లు 7 శాతం క్షీణించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం మేర పడిపోయాయి.




భారత ఐటీ సంస్థలు అంతర్జాతీయ ప్రాజెక్టులు, సాంకేతిక సేవల విస్తరణలో విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో యాక్సెంచర్ అంచనాలు నేరుగా ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తుండటంతో సంప్రదాయ ఐటీ సేవల డిమాండ్‌పై అనిశ్చితి నెలకొన్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఐటీ రంగ భవిష్యత్తుపై జాగ్రత్త సంకేతాలు వెలువడటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ప్రారంభించారని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్ని రోజులుగా లాభాల బాటలో సాగిన దేశీయ మార్కెట్లు శుక్రవారం ఒక్కసారిగా ఒత్తిడికి లోనయ్యాయి. ఈ పరిణామాల ప్రభావంతో ప్రధాన సూచీలు కూడా బలహీనపడ్డాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అయితే దీర్ఘకాలికంగా భారత ఐటీ రంగ వృద్ధి అవకాశాలు ఇంకా బలంగానే ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితి తాత్కాలిక ప్రభావంగా మాత్రమే చూడాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

# ఉద్యోగాలను కాదు.. అవకాశాలను పెంచుతుంది



కృత్రిమ మేధ ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చలు జోరుగా సాగుతున్న వేళ ప్రముఖ వ్యాపారవేత్త జెఫ్ బెజోస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు అంతరించిపోతాయనే భయాలు అతిశయోక్తి మాత్రమేనని, వాస్తవానికి ఈ సాంకేతికత భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పారిస్‌లో నిర్వహించిన సాంకేతిక సదస్సులో మాట్లాడిన బెజోస్, కృత్రిమ మేధ మనుషులను భర్తీ చేయడానికి రాలేదని, వారి సామర్థ్యాలను మరింత పెంచేందుకు వచ్చిందని తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా ఉద్యోగులు తమ పనులను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించగలరని చెప్పారు. ఇప్పటివరకు సమయం, వనరులు లేదా సాంకేతిక పరిమితుల కారణంగా సాధ్యం కాని అనేక పనులను భవిష్యత్తులో సులభంగా చేయగల పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. ప్రపంచంలో ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అనేక సమస్యలు ఉన్నాయని, వాటికి కొత్త పరిష్కారాలను కనుగొనే శక్తి కృత్రిమ మేధకు ఉందని ఆయన అన్నారు. ప్రజల ఉత్పాదకత పెరిగిన కొద్దీ కొత్త పరిశ్రమలు, కొత్త వ్యాపార రంగాలు, కొత్త సేవలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. అలాంటి పరిణామాలు కొత్త రకాల ఉద్యోగాలకు దారితీస్తాయని, ఉపాధి అవకాశాలను మరింత విస్తరింపజేస్తాయని చెప్పారు.

అయితే మరోవైపు కృత్రిమ మేధపై ఆందోళనలు కూడా కొనసాగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన పలు సర్వేల్లో గణనీయ సంఖ్యలో ప్రజలు తమ ఉద్యోగాలు భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయనే భయాన్ని వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడం, పనితీరును మెరుగుపరచడం కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను వినియోగించడం ప్రారంభించాయి. దీంతో ఉద్యోగులలో అనిశ్చితి నెలకొంది.

ఈ నేపథ్యంలో స్పందించిన బెజోస్, గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చినప్పుడు కూడా ఇలాంటి భయాలే వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు. ప్రారంభ దశలో మార్పులు కొంత ఒత్తిడిని సృష్టించినప్పటికీ, తర్వాత కాలంలో కొత్త పరిశ్రమలు పుట్టుకొచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించాయని అన్నారు. అదే విధంగా కృత్రిమ మేధ కూడా తొలుత సవాళ్లను తీసుకొచ్చినా, దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధికి, ఉపాధి విస్తరణకు కారణమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కృత్రిమ మేధ మనుషుల స్థానాన్ని ఆక్రమించే సాంకేతికత కాదని, వారి ప్రతిభను మరింత విస్తరించే సాధనమని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానం మరియు మానవ నైపుణ్యాలు కలిసి పనిచేసే కొత్త యుగానికి కృత్రిమ మేధ నాంది పలుకుతుందని బెజోస్ అభిప్రాయపడ్డారు.





# స్థిరంగా ఇంధన ధరలు.. వాహనదారులకు తాత్కాలిక ఊరట

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు విడుదల చేసిన తాజా ధరల జాబితా ప్రకారం జూన్ 19న కూడా ఇంధన ధరలు యథాతథంగా కొనసాగాయి. దీంతో వాహనదారులకు ధరల పెరుగుదల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది. అమెరికా‌ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కొంత మేర తగ్గినప్పటికీ, దేశీయంగా ఆ ప్రభావం ఇంకా కనిపించలేదు. గతంలో చమురు మార్కెటింగ్ సంస్థలకు వచ్చిన నష్టాలను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రస్తుతం ధరల తగ్గింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.73గా కొనసాగుతుండగా, డీజిల్ ధర రూ.103.82గా స్థిరంగా ఉంది. రాష్ట్రంలో అధిక పన్నుల కారణంగా ఇంధన ధరలు ఇంకా రూ.100కు పైగానే కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.78గా, డీజిల్ ధర రూ.104.52గా నమోదైంది. రాష్ట్ర పన్నుల ప్రభావంతో విజయవాడలో ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఉన్నాయి. విశాఖపట్నంలో పెట్రోల్ ధర రూ.116.39గా ఉండగా, డీజిల్ ధర రూ.104.34గా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఇతర నగరాలతో పోలిస్తే విశాఖలో ఇంధన ధరలు స్వల్పంగా తక్కువగా ఉండటం వాహనదారులకు కొంత ఉపశమనంగా మారింది. ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా మరింత తగ్గితే దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతానికి చమురు సంస్థలు ధరలను స్థిరంగానే కొనసాగిస్తున్నాయి.

# ఫోన్‌పే వాలెట్ వినియోగదారులకు కొత్త నిబంధనలు

డిజిటల్ చెల్లింపుల వేదికగా విస్తృతంగా ఉపయోగిస్తున్న ఫోన్‌పే తమ వాలెట్ వినియోగదారుల కోసం కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. చాలా కాలంగా వాడకుండా ఉన్న వాలెట్ ఖాతాలపై నిర్వహణ రుసుము విధించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం లక్షలాది మంది వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఫోన్‌పే వాలెట్‌ను యాక్టివేట్ చేసుకున్న తర్వాత చాలా మంది దానిని తరచుగా ఉపయోగించరు. కొందరు వినియోగదారులు సంవత్సరాల తరబడి ఎలాంటి లావాదేవీలు చేయకుండా వాలెట్‌ను అలాగే ఉంచేస్తున్నారు. ఇలాంటి నిష్క్రియ ఖాతాలను నిర్వహించడానికి అదనపు ఖర్చు అవుతోందని సంస్థ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇనాక్టివ్ వాలెట్లపై ప్రత్యేక నిర్వహణ రుసుము వసూలు చేయాలని నిర్ణయించింది.




కొత్త నిబంధనల ప్రకారం వరుసగా 365 రోజుల పాటు వాలెట్ ద్వారా ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపని ఖాతాలను నిష్క్రియ ఖాతాలుగా పరిగణిస్తారు. అలాంటి వాలెట్‌లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ.100తో పాటు వర్తించే పన్నులను కలిపి నిర్వహణ రుసుము విధించనున్నారు.

వాలెట్‌లో రూ.100 లేదా అంతకంటే ఎక్కువ మొత్తం అందుబాటులో ఉంటే ఆ మొత్తాన్ని నేరుగా కట్ చేసుకుంటారు. ఒకవేళ వాలెట్‌లో రూ.100 కంటే తక్కువ మొత్తం ఉంటే అందుబాటులో ఉన్న మొత్తం మొత్తాన్నే రుసుముగా తీసుకుంటారు. ఈ ప్రక్రియ గురించి వినియోగదారులకు ముందుగానే సమాచారాన్ని అందించనున్నట్లు సంస్థ తెలిపింది.

అయితే ఈ రుసుము నుంచి తప్పించుకోవడం చాలా సులభం. వాలెట్‌ను పూర్తిగా ఖాళీ చేయాల్సిన అవసరం లేదు. ఏడాదిలో కనీసం ఒకసారి అయినా వాలెట్ ద్వారా చెల్లింపు చేయడం, నగదు బదిలీ చేయడం లేదా ఇతర లావాదేవీలు నిర్వహించడం ద్వారా ఖాతాను క్రియాశీలంగా ఉంచుకోవచ్చు. అలా చేస్తే ఎలాంటి నిర్వహణ రుసుము వర్తించదు.


ఫోన్‌పే వాలెట్ సేవలను వినియోగించే వారు తమ ఖాతా స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, ఎక్కువ కాలం ఉపయోగించకపోతే నిర్వహణ రుసుము పడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వాలెట్‌లో నిల్వగా డబ్బు ఉంచి మరిచిపోయే వినియోగదారులు ఈ కొత్త నిబంధనలను గమనించడం అవసరమని చెబుతున్నారు.

డిజిటల్ చెల్లింపుల రంగంలో వినియోగదారుల భద్రత, ఖాతాల నిర్వహణ, సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇకపై ఫోన్‌పే వాలెట్ కలిగిన వినియోగదారులు తమ ఖాతాలను క్రమం తప్పకుండా ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడింది.



# ‘ఎన్‌బీకే 111’లో కాజల్..

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘ఎన్‌బీకే 111’ నుంచి చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక కానుక అందించింది. నటి కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ, ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత కొన్ని వారాలుగా ఈ చిత్రంలో కథానాయిక ఎవరు అన్న అంశంపై పలు ఊహాగానాలు వినిపించగా, తాజా ప్రకటనతో వాటికి తెరపడింది. విడుదలైన పోస్టర్‌లో కాజల్ సాధారణ చీరకట్టులో, కళ్లజోడు ధరించి గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె రూపం పాత్ర ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సాధారణంగా గ్లామర్ పాత్రల్లో కనిపించే కాజల్‌ను ఈ చిత్రంలో భిన్నమైన శైలిలో చూపించడం విశేషంగా మారింది. పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ చిత్రం ఆమె సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ఇది బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం. గతంలో విడుదలైన ‘భగవంత్ కేసరి’లో వీరిద్దరూ కలిసి నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ చిత్రంలో కాజల్ పాత్రకు మంచి గుర్తింపు లభించగా, తాజా చిత్రంలో ఆమె మరింత కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రంలో యాక్షన్, భావోద్వేగ అంశాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. కథలో కీలక మలుపులు తిప్పే పాత్రలో కాజల్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే మరిన్ని విశేషాలను చిత్రబృందం వెల్లడించే అవకాశం ఉంది. బాలకృష్ణ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ చిత్రంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. గోపీచంద్ మలినేని మాస్ టేకింగ్, బాలకృష్ణ శక్తివంతమైన పాత్ర, కాజల్ కీలక పాత్ర ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.




# ‘ఓం’తో ధనుష్ భారీ సంచలనం

తమిళ స్టార్ హీరో ధనుష్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 55వ చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం విడుదల చేసింది. డీ55గా రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి ‘ఓం’ అనే శక్తివంతమైన శీర్షికను ఖరారు చేస్తూ ‘ఓం తొలి దాడి’ పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సినీ అభిమానుల్లో విశేష ఆసక్తిని రేకెత్తిస్తోంది.
విడుదలైన గ్లింప్స్‌లో దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల నేపథ్యంలో సాగే యాక్షన్ కథను పరిచయం చేశారు. అమాయక గిరి జనులను సాయుధ దళాలు చుట్టుముట్టిన సమయంలో వారు “అన్నామలయ్యార్‌కు” అంటూ నినదించే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకీతో ధనుష్ కనిపించే తీరు సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాయుధ బలగాలతో ఒంటరిగా తలపడే యాక్షన్ సన్నివేశాలు గ్లింప్స్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.
ఈ చిత్రాన్ని బహుభాగాల సిరీస్‌గా రూపొందిస్తున్నట్లు సమాచారం. తొలి భాగాన్ని “ఉధిరం - రక్తవనం” పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. గతంలో విడుదలైన ‘అమరన్’ చిత్రం విజయానంతరం వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.
ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే విడుదలైన గ్లింప్స్‌లో ధనుష్ పాత్రను మాత్రమే చూపించి, మిగతా ప్రధాన పాత్రల రూపాలను రహస్యంగా ఉంచారు. సాయి పల్లవి పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.



# సంధ్య థియేటర్ కేసులో అల్లు అర్జున్‌కు సమన్లు

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ నెల 22న కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.
ఈ కేసులో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని మొదటి నుంచి పదో నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 19 మందికి కోర్టు సమన్లు జారీ చేయగా, 23 మందిపై పోలీసులు ఇప్పటికే అభియోగపత్రం దాఖలు చేశారు.
గత ఏడాది డిసెంబర్ 4న ‘పుష్ప 2’ ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద భారీ సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.
ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ న్యాయబృందం కూడా సమన్ల విషయాన్ని ధ్రువీకరించింది. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఈ ఘటనలో వివిధ వ్యక్తులు, సంస్థల పాత్రలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జూన్ 22న జరగనున్న విచారణ కేసు దర్యాప్తులో కీలక మలుపు కావచ్చని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.



# ఫోక్ గాయని నాగదుర్గకు హీరోయిన్‌గా అవకాశం

జానపద గీతాలు, నృత్యాలతో సామాజిక మాధ్యమాల్లో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ జానపద కళాకారిణి నాగదుర్గ ఇప్పుడు కథానాయికగా వెండితెరపై సందడి చేయనుంది. తన ప్రత్యేక గానశైలి, సహజమైన నృత్య ప్రదర్శనలతో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న నాగదుర్గకు టాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మక అవకాశం దక్కింది.
ప్రసిద్ధ సినీ రచయిత, దర్శకుడు సుకుమార్కు చెందిన నిర్మాణ సంస్థతో పాటు ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో నాగదుర్గ కథానాయికగా ఎంపికైనట్లు సినీ వర్గాలు వెల్లడించాయి.
ఈ చిత్రంలో హీరోగా ప్రియదర్శి నటించనుండగా, వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం కానున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో నాగదుర్గ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండనున్నట్లు సమాచారం.
ఇప్పటికే కొన్ని చిత్రాల్లో నటనతో తన ప్రతిభను చాటుకున్న నాగదుర్గ, ఇప్పుడు ప్రధాన కథానాయికగా అవకాశాన్ని అందుకోవడం విశేషంగా మారింది. ఆమె సహజమైన నటన, గ్రామీణ నేపథ్యానికి దగ్గరైన వ్యక్తిత్వం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గాంధీ సరోవర్‌కు రక్షణ శాఖ అనుమతి

- **ముఖ్యమంత్రి కృతజ్ఞతలు**
- **మూసీ పునరుజ్జీవనానికి కీలక ముందడుగు**
- **బాపూఘాట్ అభివృద్ధికి మార్గం సుగమం**





**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గాంధీ సరోవర్ నిర్మాణ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ, భారత సైన్యం అనుమతి ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ, భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. బాపూఘాట్ ప్రాంతంలో చేపట్టనున్న గాంధీ సరోవర్ కార్యక్రమానికి అనుమతి లభించడం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక విజయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి మరింత ఊతమిస్తుందని అన్నారు. నది తీర ప్రాంతాలను పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించారు. మూసీ నది పునరుద్ధరణతో పాటు నది తీర ప్రాంతాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని ముఖ్యమంత్రి తెలిపారు. పచ్చదనం పెంపు, ప్రజలకు విహార ప్రదేశాల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన వేదికల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ సరోవర్ కార్యక్రమం ద్వారా హైదరాబాద్ నగరానికి కొత్త గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నగర అందాలను పెంచే విధంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే స్థిరమైన అభివృద్ధి నమూనాగా దీనిని రూపొందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ, భారత సైన్యం అందించిన సహకారం అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల నుంచి లభిస్తున్న సహకారం వల్ల ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించగలుగుతున్నామని అన్నారు.

మూసీ నది పునరుజ్జీవనం, నది తీర ప్రాంతాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో ఒకటిగా కొనసాగుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గాంధీ సరోవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత హైదరాబాద్ నగరానికి ఇది మరో ఆకర్షణీయమైన కేంద్రంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెండు కార్లు ఢీ.. ముగ్గురు మృతి



- **నల్గొండ జిల్లాలో విషాదం**
- **మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**
- **ఆసుపత్రికి తరలించిన బాధితులు**

**నల్గొండ, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** నల్గొండ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దావూర మండలంలోని రామన్నగూడెం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల్లో చిక్కుకున్న వారిని స్థానికుల సహాయంతో బయటకు తీశారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని వెంటనే నాగార్జునసాగర్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల వేగం, రహదారి పరిస్థితులు, ఇతర కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రామన్నగూడెం పరిసర ప్రాంతాల్లో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సింగరేణి కార్మికుల పక్షాన పోరాటం

- **బాయిబాటలో భాగంగా గనుల సందర్శన**
- **కార్మికుల సమస్యలు తెలుసుకున్న కవిత**
- **హక్కుల పరిరక్షణకు అండగా ఉంటామని భరోసా**



**మంచిర్యాల, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "బాయిబాట" కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ఆద్రియాల భూగర్భ బొగ్గు గనిని సందర్శించారు. గనిలో పనిచేస్తున్న కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, వారి పరిస్థితిని విని కవిత భావోద్వేగానికి గురయ్యారు. కార్మికులకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సింగరేణి సంస్థ ఉత్తర తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని కవిత పేర్కొన్నారు. వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి సంస్థకు ప్రభుత్వం సరైన సహకారం అందించడం లేదని ఆరోపించారు. సింగరేణికి రావాల్సిన భారీ మొత్తాలు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని విమర్శించారు.

భూగర్భ గనుల్లో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. గనుల్లో ఉపయోగించే యంత్రాలను ఆధునికీకరించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. భూగర్భ ప్రాంతాలకు చేరుకోవడానికి కార్మికులు ఎక్కువసేపు ప్రయాణించాల్సి వస్తోందని, దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ అవసరమని అన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే వారిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. గనుల ప్రాంతాల్లో తమ సమావేశాలకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కార్మికులను కలవడం, వారి సమస్యలను తెలుసుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి హక్కు అని పేర్కొన్నారు. కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తే తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సింగరేణి సంస్థ భవిష్యత్తు కోసం భూగర్భ గనుల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత సూచించారు. కొత్త గనుల అభివృద్ధి, ఉద్యోగ భద్రత, పదోన్నతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ బలోపేతం కావాలంటే కార్మికులు, అధికారులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. బొగ్గు గనులు, సహజ వనరులపై రాష్ట్ర హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, కార్మికుల మద్దతుతో తమ పోరాటాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు.

# ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునికీకరణకు రాష్ట్రం సిద్ధం



- **20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య గిడ్డంగులు**
- **నిల్వ నష్టాల నివారణకు కొత్త విధానం**
- **రైతులకు అంతరాయం లేకుండా కొనుగోళ్లు**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాలలో అత్యాధునిక ధాన్య గిడ్డంగులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ గిడ్డంగుల ద్వారా ధాన్యం నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రతిపాదనపై ప్రముఖ ధాన్య నిల్వ, రవాణా సంస్థల ప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తొలి దశలో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగుల ఏర్పాటు ప్రతిపాదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థకు అదనంగా ఈ సదుపాయాలు పనిచేస్తాయని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్త వ్యవస్థను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ పేదరిక నిర్మూలన కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రస్తుతం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని మంత్రి తెలిపారు. కొత్త వ్యవస్థ వల్ల వారి పాత్ర తగ్గదని, మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రైతులకు సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక గిడ్డంగుల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, పంపిణీ వరకు మొత్తం ప్రక్రియ యాంత్రీకరణ ద్వారా నిర్వహించబడనుంది. ధాన్యం నాణ్యత పరీక్షలు, తేమ కొలతలు, నిల్వ పరిస్థితుల పర్యవేక్షణ అన్నీ అంకీయ పద్ధతిలో జరగనున్నాయి. దీంతో మానవ శ్రమ అవసరం తగ్గడంతో పాటు నిల్వ నష్టాలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ధాన్య నిల్వ కేంద్రాల్లో ఉష్ణోగ్రత, తేమ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించే ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. గాలి ప్రసరణ వ్యవస్థలు, కీటక నియంత్రణ చర్యల ద్వారా ధాన్యం నాణ్యతను దీర్ఘకాలం పాటు కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు వివరించారు. నిల్వ కేంద్రాల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థకు లేదా బహిరంగ మార్కెట్‌కు సరఫరా చేసే వరకు ధాన్యం నాణ్యతను పరిరక్షించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఈ గిడ్డంగులను రైల్వే రవాణా సౌకర్యాలతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధిక ఉత్పత్తి ప్రాంతాల నుంచి అవసరమైన ప్రాంతాలకు ధాన్యాన్ని వేగంగా తరలించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా ధాన్యం కొనుగోలు, నిల్వ, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# యాదాద్రిలో ప్రైవేటీకరణ వ్యతిరేక ఆందోళన



- **నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఇంజనీర్ల నిరసన**
- **టెండర్లను రద్దు చేయాలని డిమాండ్**
- **ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**

**యాదాద్రి భువనగిరి, జూన్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** యాదాద్రి ఉష్ణ విద్యుత్ కేంద్రంలో ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా విద్యుత్ ఇంజనీర్లు ఆందోళన చేపట్టారు. యాష్ నిర్వహణ, బొగ్గు నిర్వహణ విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. విద్యుత్ కేంద్రంలోని కీలక విభాగాలకు సంబంధించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఇంజనీర్లు డిమాండ్ చేశారు. ఉత్పత్తి వ్యవస్థలో భాగమైన పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఉద్యోగుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపే అవకాశముందని పేర్కొన్నారు.

యాష్ నిర్వహణ, బొగ్గు నిర్వహణ వంటి కీలక కార్యకలాపాలు విద్యుత్ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయని, వాటిని ప్రైవేటు చేతుల్లో పెట్టడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. ప్రైవేటీకరణ వల్ల ఖర్చులు పెరగడంతో పాటు నాణ్యత, భద్రతా ప్రమాణాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రస్తుతం యాదాద్రి విద్యుత్ కేంద్రంతో ప్రారంభమైన ఈ ప్రక్రియ భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర విద్యుత్ కేంద్రాలకు కూడా విస్తరించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. ఒకసారి ఈ విధానం అమల్లోకి వస్తే విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలు కూడా ప్రైవేటీకరణ బాట పట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నాయి.

విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను క్రమంగా ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలను చూస్తున్నామని ఇంజనీర్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యోగులు, ఇంజనీర్లు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియను నిలిపివేసి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తమ ఆందోళనలను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగ ఉద్యోగులను కలుపుకొని విస్తృత స్థాయిలో పోరాట కార్యాచరణ చేపడతామని ప్రకటించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in